# మా ఆవిడతో షికారుకి

కుమారి వింజమూరి హేమలతాదేవి బి. ఏ.

సాయంత్రం ఆరుగంటలవుతోంది. రోడ్లన్నీ జనసమూహంతో బాగా క్రిక్కిరిసి వున్నాయి. అటుపోయేవారు, ఇటువచ్చేవారు అంతా యెవరి దారిన వారు పోతున్నారు. పడమటి దిక్కునుండి చల్లని పిల్లవాయువులు వీస్తూ, మనస్సున కాహ్లాదమును గూర్చుచున్నాయి. 'శంకర విలాస్' హోటలు నుండి "ఈ జీవితమే స్వర్గము" అని సన్నగా రికార్డు వినిపిస్తూవుంది.

నేను ఆ రోజు ఒకటవ తారీఖు కాబట్టి ఆఫీసులో యిచ్చిన జీతం తీసుకొని ఇంటికి వస్తున్నాను. ఎదురుగా నాసికకు చక్కని మల్లెల సువాసన తగిలింది. వెంటనే బేడా యిచ్చి మల్లెపూలుకొని ఇంటికి వచ్చాను. ఎదురుగా మా శ్రీమతి నవ్వుతూ వచ్చింది. ఎప్పుడు యేవంటింట్లోనో కూర్చొని పనీపాటా చేసుకొనేది. యీ రోజు యిట్లా యెదురుగావచ్చి చిరునవ్వు నవ్వుతో ఉందంటే యిందులో అంతరార్థమేదో వుందనుకొన్నాను.

"దయచేయండి" అంది నవ్వుతూ.

"బయటికా, లోపలికా??" అన్నాను నేను.

"మీ ఇష్టం. మీరు యెటువెళ్లదలచుకొంటే అటు" అంది మా శ్రీమతి.

నేనుకూడా చిఱునవ్వు నవ్వుతూ లోనికి వెళ్లాను. వెంటనే నాకు వేడివేడి కాఫిని తీసుకువచ్చింది. నేను కాఫీ త్రాగటం మొదలు పెట్టాను. ఇంతలో నేను తెచ్చిన మల్లెపూలను మాలకట్టి, వదులుగా జడవేసికొని, అందులో జారిపోయేటట్లు మల్లెలను తురిమి, గులాబీసిఫాన్‌చీర కట్టుకొని, తెల్లని క్రేపు సిల్కు జాకెట్టు ధరించి, గలగలమని గాజుల ధ్వనితో నా యెదుటవచ్చి నిల్చుంది మా ఆవిడ తలయెత్తి చూశాను.

"ఏమండీ! మరి ..." అంది.

"ఆగిపోయావేం? త్వరగాచెప్పు. నీ మృదుమధుర వాక్కులనువిన నా కర్ణములతియాసక్తితో యెదురుచూచుచున్నవిగావున నావీనుల విందుగావించి నన్నానందపరవుమని" గుక్క త్రిప్పుకోకుండా అనేశాను నేను.

"సంతోషించాంలెండి మీ కవిత్వానికి. కాళిదాసు తర్వాత మిమ్మల్నే చెప్పుకోవాలి" అంది విసుగ్గా.

నేను యెంతో ఆశగా నన్ను మెచ్చుకోవాలని తప్పులు, ఒప్పులు అన్నీ కలిపి మిశ్రమ కవిత్వం ధారాళంగాచెప్తే మా ఆవిడ నాలోని ప్రతిభను గుర్తించలేదని నాకు కొంచెం కోపం వచ్చింది. అయినా "శ్రీమతిగారితో కలహం పెట్టుకోవటమంటే మాటలా?" అనే సంగతిని గుర్తుకు తెచ్చుకొని "అయితే నేను అపరకాళిదాసునన్నమాట" అన్నాను.

"అబ్బబ్బబ్బ! నా మాట వినరేమిటండీ!" అంది.

"సరేలే. ఆ చెప్పదలచుకొన్నదేమిటో మూడు ముక్కల్లో, నన్ను విసిగించకుండా త్వరగా చెప్పు" అన్నా.

"ఇవ్వాళ సాయంత్రం 6 గంటలకు ప్రఖ్యాత సినీతార నళిని నృత్యప్రదర్శన మున్నదట. టికెట్టు

ఒకటి 10 రూపాయలట. నేను రెండు టికెట్లు మన యిద్దరికి తీసుకున్నాను. మరి మనం వెళ్దామా?" అంది మెల్లగా.

"సరేలే! దొరసానిగారి ఆజ్ఞ జవదాటితే..." నేను వాక్యం పూర్తిచేయక మునుపే "త్వరగా రెడీ కాండి దొరగారూ" అంటూ శ్రీమతి పాంటూ, షర్టూ తెచ్చింది.

"తప్పదు" అనుకుంటూ నేను పాంటూ షర్టూ తొడుక్కొని శ్రీమతితో బయటకు నడిచాను.

దారిలో నా చిన్ననాటి స్నేహితుడు రామం కనిపించాడు. మేము చిన్నప్పుడు చదువుకొనే రోజుల్లో వాడు బహు సోమరిగా వుండేవాడు. క్లాసులో పాఠాలేమీ వినేవాడు కాదు. వాడిని అందరు "ఒరేయ్ సోమరిపోతూ" అని పిలిచే వారు. వాడు ఇప్పుడు పెద్ద ఆఫీసరయ్యాడు. నేను క్లాసులో ఫస్టయినా నాకు మాత్రం గుమాస్తా వుద్యోగం దొరికింది. "ఏమి నీ లీలలు భగవాన్! క్లాసులోని ఒక మొద్దుకి పెద్ద ఆఫీసరు హోదా! ఫస్టుగావుండే నా బోటివాడికి గుమాస్తా వుద్యోగమా!" అనుకున్నాను.

ఇక నేను వాడితో ప్రసంగం మొదలు పెట్టానో లేదో మా ఆవిడ నా వైపు కొఱకొఱ చూచింది. ఆ చూపులధాటికి తట్టుకోలేక నేను రామంతో "వెళ్ళొస్తాను బ్రదర్. పనుంది" అనేసి ముందుకి నడిచాను.

ఇక మా శ్రీమతి నా మీద పెద్ద వాఖ్యానం మొదలుపెట్టింది. "మీ మొగవాళ్లంతా యింతే. కనబడిన ప్రతివారితోను బాతాఖాని పెట్టుకుంటారు. మేము ఆడవాళ్లం రోడ్డుమీద అట్లా నిలబడినా మీరేమీ అనుకోరు. నడిరోడ్డుమీద నిలవబడలేక మేము సిగ్గుపడాలి కాని మీకేమీ పర్వాలేదు" అని యింకా యింకా ఏమేమో తీవ్రమైన వాక్కుల వర్షం కురిపించింది నా మీద.

నేను ఆమెవైపు గుడ్లప్పగించి చూస్తూ వుండి పోయాను. అంతకంటె ఏంచేయగలను?

ఇంతలో ఆమె స్నేహితురాలు విమల మా కెదురైంది. ఆమెను చూచి చూడటంతోటే "హల్లో విమలా! ఏమిటి సంగతులు? ఈ మధ్య అసలు కన్పించటమేలేదే?" అంటూ మా ఆవిడ ఆమెతో బాతాఖాని పెట్టుకుంది. ఇక యెంతకీ ముగించే టట్లులేదు. ఈ ఆడవారి నోటిని కట్టేయటం ఎవ్వరికీ సాధ్యపడదనుకొని "మన ప్రోగ్రాం" అన్నాను మెల్లగా వినిపించేటట్లు. అప్పుడు కబుర్ల లోకం నుండి మన లోకంలోకి వచ్చిపడింది ఆమె. విమలకు 'గుడ్ బై' చెప్పి "ఇక నడవండి" అంది నా వైపు చూచి, ఇంతసేపు తప్పంతా నాదే నన్నట్లు ఫోజు పెట్టి.

"ఇందాక నేను రామంతో ఒక్క అరనిముషం మాట్లాడేటప్పటికి పెద్ద రాద్ధాంతం చేసిన మా ఆవిడ యిప్పుడు తను గంటసేపు విమలతో ఎట్లా బాతాఖాని పెట్టుకుందో!" అని అడగాలనిపించింది నాకు. కాని మళ్లీ ఎందుకీ రభసయని వూరుకున్నాను.

మేము యింకా కొంతదూరం నడిచేటప్పటికి "టైం ఎంతయిందండీ?" అంది.

రిస్టువాచికేసి చూశాను. "5.30 అవుతోంది" అన్నాను.

"ఇంక అరగంటలో మనం అక్కడికి చేరుకోవాలన్నమాట" అంది ఆదుర్దాతో.

"అవును మరి నీవు కనబడిన వాళ్లందరితో అంతంత సేపు బాతాఖాని పెట్టుకుంటే మనం అక్కడికి చేరినట్లే" అన్నాను నేను వుండబట్టలేక.

"సరేమరి త్వరగా నడవండి" అంది మా ఆవిడ. ఇంతలో పటపటమను చినుకులతో వర్షం ప్రారంభమైంది. దరిదాపులో యెక్కడా బండ్లు కన్పించలేదు. ఇక చేసేది లేక తడుస్తూనే నడవటం మొదలు పెట్టాము. వర్షం మరీజోరుగా కురుస్తోంది.

"గొడుగైనా తీసుకురాలేదే!" అంది ఆమె

"వానవస్తుందని కలగన్నామా యేమిటి?" అన్నా నేను.

రామరాను పురుములతో, మెఱుపులతో వర్షం మరీ అధికమైంది.

ఇక మేము ప్రక్కనున్న ఇంట్లోకి జొరబడ్డాము. ఆ ఇంట్లో భార్యాభర్తలిద్దరూ, ముగ్గురు పిల్లలూ వున్నారు. మమల్ని చూడగానే చాపవేసి కూర్చోమన్నారు.

"చూడండి మీరు ఆఫీసునుండి కొంచెం త్వరగా వస్తే హాయిగా నళిని నృత్యప్రదర్శనానికి వెళ్లే వాళ్లము. మీరు ఆలస్యంగా రావటంవల్లనే ఈ బాధంతాను," అంది మా ఆవిడ తప్పంతా నాదైనట్లుగా

"నీవు విమలతో అంత సేపు బాతాఖాని పెట్టుకోకుండావుంటే ఈపాటికి యెప్పుడో అక్కడికి చేరేవాళ్ళము" అన్నాను నేను ఉక్రోషం పట్టలేక.

"ఏమయితేనేం లెండి. మీరుబయలుదేరటమూ — సరిగా అదే సమయానికి వానరావటమూ" అంది ఆ ఇంటావిడ.

ఇట్లా మాసంభాషణతో చాలసేపు గడచిపోయింది. వాన అప్పుడే వెలసింది. రిష్టువాచిలో చూశాను. 10 గంటలు అవుతోంది.

"ఇంతరాత్రి యెక్కడికి పోతారులెండి. ఈ రాత్రికి ఇక్కడేవుండండి" అన్నారు భార్యాభర్తలిద్దరూ.

"పర్వాలేదులెండి" అని వాళ్లకి థాంక్సు చెప్పి యిద్దరం బయటకునడిచాము.

"ఉండండి బండినిపిలుస్తాను." అని ఆ ఇంటాయన ఒక బండిని పిలిచారు. దానిలో యెక్కి నేనూ, మా ఆవిడ ఇంటికి చేరాము.

"అయ్యో! రెండు టికెట్లు 20 రూపాయలకు కొన్నానే! ఆ ఇరవై రూపాయలూ పెట్టితే జార్జెట్ సిల్కు చీర యింకొకటి వచ్చేది! నీలిరంగుజార్జెట్ చీరను కొనాలని నాకు ఎన్నాళ్లనుంచో ఆశగావుంది. హాయిగా గులాబీజార్జెటు చీరతోపాటు నీలిరంగు జార్జెటు చీరకూడా వచ్చేది. మనం అనవసరంగా 20 రూపాయలు నష్టపోయాం!" అంది మా ఆవిడ దిగులుగా.

"ఇంకానయం! వానలో తడవకుండా మంచి ఆశ్రయం దొరికినందుకు సంతోషించు. వానలో తడిస్తే నీవు కట్టుకున్న ఇరవైరూపాయల గులాబి చీర పాడయిపోయేది. కాబట్టి మనం 20 రూపాయలు నష్టపడలేదని తృప్తిపడు" అన్నాను నేను.

ఇప్పుడు మేము 20 రూపాయలు నష్టపడ్డామో లేక మాకు 20 రూపాయలు లాభమొచ్చిందో అనేది మా ఇద్దరిలో ఎవ్వరికి బోధపడలేదు.

పాత్రుడుగారి

బాలసంజీవిని (Regd)

పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును

డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్,

19, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు–4. Phone 71354

కుంభకోణము బ్రాంచి : 7. సారంగపాణి కోవిల తూర్పువీధి.

అన్ని మందుల షాపులలోను దొరకును.